నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధి సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆటోమీటర్ సీల్ ఆఫీస్, సింగరేణి పార్క్, ఆదర్శనగర్ నాలా, సరస్వతీ శిశు మందిర్, సరూర్‌నగర్ చెరువు కట్ట, సింగరేణి కాలనీ గార్డు పీటీ పరిసర ప్రాంతాలు.
- మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు శంకేశ్వరబజార్, గ్రీన్ అపార్ట్‌మెంట్స్, సింగరేణి కాలనీ పెట్రోల్ పంప్, పీఅండ్‌టీ కాలనీ కల్లు కాంపౌండ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

పరామర్శ



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మలక్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ తీగల రంజిత్‌రెడ్డి అంత్యక్రియలు మీర్‌పేట పెద్ద చెరువు శ్మశాన వాటికలో నిర్వహించారు. ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆజంఅలీ, మాజీ కార్పొరేటర్లు ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జాబ్‌మేళాకు స్పందన



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగ యువత

మలక్‌పేట: నిరుద్యోగ యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని స్ఫూర్తి విద్యాసంస్థల సీఈవో హోలిధర్ రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని స్ఫూర్తి డిగ్రీ కాలేజీ యాజమాన్యం ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందన్నారు. ఈ మేళాలో 14 కంపెనీలు పాల్గొనగా 2500 మంది యువత హాజరు కాగా 565 మంది ఉద్యోగాలక ఎంపికైనట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు.

దివ్యాంగులకు 12 రకాల ఉపకరణాల పంపిణీ

చాదర్‌ఘాట్: రాష్ట్రంలోని దివ్యాంగులకు 2025–2026 సంవత్సరానికి 12 రకాల ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ సహకార సంస్థ అధికారులు తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

1. మొటరైజ్‌డ్ వాహనాలు (స్కూటీలు)	-	2000
2. క్రచ్చర్స్	-	900
3. ల్యాప్‌టాప్‌లు	-	400
4. వీల్‌చైర్స్	-	250
5. బ్యాటరీ వీల్‌చైర్స్	-	500
6. ట్రేడింగ్ ఆటోస్	-	50
7. 5జీ ఫోన్స్	-	100
8. హియరింగ్ హెడ్స్	-	100
9. అంధుల కర్రలు	-	250
10. చెప్పులు (లెప్రసీ వాళ్లకు)	-	100
11. ట్రైసైకిల్	-	200
12. బ్యాటరీ వాహనాలు	-	100

మలక్‌పేటలో భారీ వర్షం

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్‌జోన్ పరిధిలో గురువారం కురిసిన భారీ వర్షానికి పలు కాలనీలు, బస్తీలు జలమయంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగి రోడ్లను ముంచెత్తాయి. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, అక్బర్‌బాగ్, ఓల్డ్ మలక్‌పేట్, మున్సిపల్ కాలనీ, పద్మనగర్, కాలడేర, మలక్‌పేట్ రైల్వే బ్రిడ్జి, అజంపుర, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, ఐఎస్‌సదన్, తదితర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీలు జలమయంగా మారాయి. మలక్‌పేట్, నల్గొండక్రాస్‌రోడ్డు, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం తదిర ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం కావడంతో కొద్దిసేపు రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. వర్షం వచ్చిన ప్రతిసారీ కాలనీలు ముంపునకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ డంపర్ బిన్లు

- స్వచ్ఛ ఆటోలు వెళ్లనిచోట ఏర్పాటు
- మలక్‌పేట సర్కిల్ పరిధిలో 103 ప్రాంతాలు గుర్తింపు



ఓల్డ్‌మలక్‌పేటలో ఏర్పాటు చేసిన డంపర్ బిన్లు

చాదర్‌ఘాట్: చెత్త పేరుకుపోతున్న ప్రాంతాలు, చెత్త సేకరించలేని ప్రాంతాల్లో మళ్లీ డంపర్ బిన్లు ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. చెత్త సేకరించే స్వచ్ఛ ఆటోలు వెళ్లలేని ప్రాంతాల వారి కోసం ఈ డంపర్ బిన్లు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో డంపర్ బిన్లు తొలగించారు. ప్రజలకు రోడ్ల పక్కన చెత్త వేయవద్దని అవగాహన కల్పించారు. ఎవరైనా రోడ్ల పక్కన చెత్త వేస్తే వారికి జరిమానాలు కూడా విధించారు. విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రోడ్ల పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకున్నారు. అయినా సరే జనం బేఖాతరు చేశారు. ఎప్పటిలాగే రోడ్ల పక్కన చెత్త వేస్తూనే ఉన్నారు. జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల్లో మార్పు కనిపించడం లేదు. డంపర్ బిన్లు తీసేసిన చోట గుట్టలుగా చెత్తా చెదారం గాలికి కాలనీలు, బస్తీల్లో వచ్చేది. వర్షం వస్తే వరదనీటితో కొట్టుకొచ్చి దుర్గంధంతో పరిశుభ్రత లోపించిది. దీంతో తరచూ చెత్త వేసే ప్రాంతాల్లో డంపర్ బిన్లు ఏర్పాటు చేయాలని సర్కిల్–6 పరిధిలో పలు ప్రాంతాలలో వాటిని ఏర్పాటు చేశారు.



డంపర్ బిన్లును పరిశీలిస్తున్న డీసీ, ఏఎంహెచ్‌ఓ

స్థానికుల అభిప్రాయం మేరకే..

బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకుండా అవగాహన కల్పించడంతో పాటు వీలుకాని చోట్ల ఈ డంపర్ బిన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే సర్కిల్–6 పరిధిలో 103 చోట్ల డంపర్ బిన్లు ఏర్పాటు అవసరమని గుర్తించారు. రామ్‌కీ సంస్థ ఆధ్వర్యంలో ఈ డంపర్ బిన్లు ఏర్పాటు చేస్తున్నారు. మలక్‌పేట పరిధిలో ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో 35, సైదాబాద్ డివిజన్‌లో 26, మూసారాంబాగ్ 8, అక్బర్‌బాగ్ 20, అజంపురా 8, ఛావుణిలో 6 ఏర్పాటు చేస్తున్నారు. మొన్నటి వరకు డంపర్ బిన్లు లేని చోట్ల చెత్త కుప్పలుగా పేరుకుపోయి ఆ ప్రాంతం సమస్యాత్మకంగా ఉండేది. తాజా పరిణామాలతో ఇక చెత్త రోడ్డు పక్కన కాకుండా ఈ డంపర్ బిన్లలో వేస్తారు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం



బీఎన్‌రెడ్డినగర్‌లో పర్యటించి సమస్యలపై ఆరా తీస్తున్న హేమంత్ కేశవ్‌పాటిల్

ఎల్‌బీనగర్: సమస్యలన్నింటిని దశలవారీగా పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో పలు కాలనీలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్యలతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు కాలనీలవాసులు, కార్పొరేటర్ డివిజన్ సమస్యలపై జోనల్ కమిషనర్ వివరించారు. ఎన్జీవోస్ కాలనీ, సచివాలయనగర్ జరుగుతున్న ఉమెన్స్ థీమ్ పార్కు పనులు వేగవంతం చేయాలి. పార్కులో ఓపెన్‌జిమ్, పిల్లలకు ఆట పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఓపెన్ నాల్యాల్లో పూడికతీత పనులు, సాహెబ్‌నగర్ శ్మశానవాటికను అభివృద్ధి చేయాలన్నారు. శ్రీపురంకాలనీ నుంచి వెంకటేశ్వర దేవాలయం వరకు నూతన రోడ్డు, పలు కాలనీలలో వీధీ దీపాలు ఏర్పాటు చేసి గుంతలు పడిన రోడ్లకు మరమ్మతు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఈఈ రమేష్‌బాబు, డీఈ దామోదర్‌రావు, శానిటేషన్ డీఈ నీలిమ, ఎలక్ట్రికల్ డీఈ పున్నానాయక్, ఎంటమాలజీ ఎఈ రవీందర్ రెడ్డి, ఇంజనీరింగ్ ఏఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చెరువుల సంరక్షణకు చర్యలు



చెరువును పరిశీలిస్తున్న మధుయాష్కిగౌడ్

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని రెండు చెరువులను రక్షించేందుకు చర్యలు తీసుకుంటామని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అన్నారు. గురువారం ఆయన డివిజన్‌లోని బాతుల చెరువు, కుమ్మరికుంట చెరువులను సందర్శించారు. ఏళ్ల తరబడి కుమ్మరికుంట పూడికతీయకపోవడంతో చెరువు ఎత్తు పెరిగిపోతుందని, ఒక్క వర్షానికే చెరువు నిండి వెంటనే ఖాళీ అవుతుందని తదితర సమస్యలను స్థానికులు మధుయాష్కి దృష్టికి తీసుకొచ్చారు. బాతుల చెరువులోకి డ్రైనేజీ నీరు వస్తుండడంతో కలుషితం అవుతుందని, కాలువలు కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన దృష్టికి తీసుకురాగా అధికారులతో మాట్లాడి చెరువుల రక్షణకు చర్యలు తీసుకుంటామని మధుయాష్కి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రవిందర్‌గౌడ్, సందీప్, రమేష్, చైతన్య, శ్రీనివాస్, సుజాతారెడ్డి, పిడుగు సుబాష్, నీరుడు రమేష్ పాల్గొన్నారు.

నరేంద్రమోదీ పాలనలో దేశం అభివృద్ధి



మాట్లాడుతున్న బంగారు శృతి

వనస్థలిపురం: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి అన్నారు. నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలనను పురస్కరించుకుని బీజేపీ రంగారెడ్డి (అర్బన్) జిల్లా ఆధ్వర్యంలో హయత్‌నగర్ డివిజన్ హుడా సాయి నగర్ కాలనీ కమ్యూనిటీహాల్లో నిర్వహించిన 'సంకల్పంతో సహకారం– ప్రొఫెషనల్ మీట్ అండ్ పత్రికా సమావేశం'లో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, రైతుల సంక్షేమం, యువతకు ఉద్యోగావకాశాలు వంటి అనేక రంగాలలో మోదీ పాలన విప్లవాత్మకంగా నిలిచిందని అన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలలో ఒక్కటిని కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సోలంకి శ్రీనివాస్, కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు నవజీవన్ రెడ్డి, వంగా మధుసూదన్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, నాయకులు రవిందర్ రెడ్డి, భాస్కర్, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

15న నారసింహా హోమం



వివరాలను వెల్లడిస్తున్న శ్రీవైష్ణవ సంఘం నేతలు

ఎల్‌బీనగర్: శ్రీవైష్ణవ సంఘం, తెలంగాణ రాష్ట్రం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్‌టీచారి, ఎస్వీఎస్ ట్రస్ట్ చైర్మన్ కండ్లకుంట యాదగిరాచార్యుల సమక్షంలో గురువారం చంద్రపురికాలనీలోని శ్రీవైష్ణవ సదనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎవీఎల్ఎన్ చారి మాట్లాడుతూ.. విశ్వశాంతి, సమాజ శ్రేయస్సుకు దేవనాథ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో ఈ నెల 15న శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి, మాజీ కేంద్రమంత్రి సుముద్రాల వేణుగోపాలాచార్యులు, రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కందాల కృష్ణమాచార్యులు, వెంకటరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.23, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.42, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.16, క్యారెట్ రూ.40, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.18, ఈ ధరలు శుక్రవారం ఉదయం 9గంటల వరకు వర్తిస్తాయి.

అంగన్‌వాడీ ర్యాలీ



సైదాబాద్: అమ్మని మరిపించేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వాత్సల్యం అందిస్తున్నామని శ్రీసాయినగర్ అంగన్‌వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు ఎస్.పద్మిని అన్నారు. నూతన విద్యా సంవత్సరం పునఃప్రారంభమైన గురువారం నుంచే అంగన్‌వాడీ కేంద్రాలు సైతం ప్రారంభించారు. చిన్నారులతో కలిసి ప్లకార్డులతో ర్యాలీగా కేంద్రానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల చిన్నారులకు అగంన్‌వాడీలో ఆటపాటలు, విద్యాబోధనాతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు.

బధిరుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

చాదర్‌ఘాట్: నల్లగొండ చౌరస్తాలోని ప్రభుత్వ బధిరులు ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని హిమాయత్‌నగర్ డిప్యూటీ డీఈఓ అస్రా ఫాతిమా తెలిపారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు తీసుకుంటున్నామని ఈ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ స్కాలర్‌షిప్ ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9849761418 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

మహేశ్వరం: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు సరిత అన్నారు. గురువారం మండల పరిధిలోని సిరిగిరిపురం ప్రభుత్వ పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించి పిల్లలను పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యతమైన విద్యాబోధన అందుతుందన్నారు. విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు, కంప్యూటర్ గదులు, లైబ్రరీతో పాటు అంగ్ల బోధన ఉంటుందన్నారు.

అక్రమ కేసులపై పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా



మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చంచల్‌గూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు మైనార్టీలు ఎన్ని తప్పులు చేసినా మాఫీ చేస్తారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో గోవుల కళేబరాల డంపింగ్ విషయంలో జరిగిన సంఘటనలో 20 మందికిపైగా స్థానిక యువకులపై పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. ఈ క్రమంలో జైల్లో ఉన్న యువకులను ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి గురువారం ప్రత్యేక ములాఖత్‌లో కలిశారు. అనంతరం జైలు బయట ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేవలం గోవధ నిషేధం, అవశేషాలతో నూనె తయారీ, డంపింగ్‌కి సంబంధించి ప్రశ్నించినందుకు హిందువులపై ప్రభుత్వం, పోలీసులు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. దళిత యువకులపై పెట్టిన అక్రమ కేసులను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానన్నారు. నేరం చేసిన వారిని, రెచ్చగొట్టిన వారిని కాకుండా ప్రతిఘటించిన వారిని పోలీసులు, ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందన్నారు. జంతు కళేబరాలు, వ్యర్థాల డంపింగ్‌కు సంబంధించి మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాది కరుణాసాగర్, అందెల శ్రీరాములు, నిరంజన్‌యాదవ్ పాల్గొన్నారు.

కష్టపడిన వారికి గుర్తింపు

మహేశ్వరం: కష్టపడిన వారికి కాంగ్రెస్ పార్టీ తగిన గుర్తింపునిచ్చి గౌరవిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనుగు జంగారెడ్డి అన్నారు. పార్టీ గంగారం నాయకులు.. గురువారం జంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తింపు రాలేదని, పదవులు దక్కలేదని ఎవరూ అసంతృప్తి చెందవద్దని సూచించారు. ఈ పదవితో తన బాధ్యత పెరిగిందన్నారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని, స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మునావత్ పాండు నాయక్, మునావత్ దేవేందర్ నాయక్, సూర్య నాయక్ పలువురు పాల్గొన్నారు.

'అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్ నేతలు'



థీమ్‌పార్కు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను కాంగ్రెస్ నేతలు అడ్డుకుంటున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్‌లో నిర్మిస్తున్న ఉమెన్ థీమ్ పార్కు పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉమెన్ థీమ్ పార్కు ఏర్పాటుకు గతంలో రూ. లక్షల్లో మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టామని అదనపు నిధులు అవసరం కావటంతో అధికారులతో చర్చించి అవి కూడా మంజూరు చేయించానని పేర్కొన్నారు. అయితే కొందరు కాంగ్రెస్ నేతలు అధికారంలో ఉన్నామని అధికారులపై ఒత్తిడి పెంచి అభివృద్ధి పనులను నిలిపివేయించారన్నారు. పార్కు పనులు పునఃప్రారంభమయ్యేలా కృషి చేసానని అన్నారు .ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఈఈ రమేష్‌బాబు, డీఈ దామోదర్, నాయకులు మధుసాగర్, గండికోట శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌వాసులపై దాడి

కేసు నమోదు

మలక్‌పేట: అక్రమ నిర్మాణాలపై ప్రశ్నించిన అపార్ట్‌మెంట్‌వాసులపై బిల్డర్ అనుచరులు దాడి చేసిన ఘటన గురువారం మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ తెలిపిన వివరాలు.. మూడు సంవత్సరాల క్రితం మసీయుద్దీన్ ఖాన్ అనే బిల్డర్ అస్మాన్‌గఢ్ రాక్ చర్చి సమీపంలో ఎలైట్ హిల్స్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ నిర్మించి అమ్మేశాడు. మసీయుద్దీన్ అపార్ట్‌మెంట్ కామన్ ఏరియాలో జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడానికి బిల్డర్ ముగ్గురు అనుచరులు అపార్ట్‌మెంట్‌లోకి పంపించగా అపార్ట్‌మెంట్ వాసులు అభ్యంతరం చెప్పారు.

దీంతో వారు దుర్భాషలాడుతూ మూకుమ్మడిగా అపార్ట్‌మెంట్ వాసులపై దాడి చేశారని, తన మేనల్లుడు బ్రహ్మానందంను కొట్టారని కామేశ్వరి(74) పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ

- యువతను దాడులకు ప్రోత్సహిస్తున్న నాయకులు
- ఏక పక్షంగా వ్యహరిస్తున్న సీఐ
- వారిపై చర్యలు తీసుకోవాలి
- ముస్లిం నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

మహేశ్వరం: హిందు– ముస్లింలు ప్రశాంతంగా జీవిస్తున్న నాగారం గ్రామంలో కొందరు బీజేపీ నాయకులు ఉద్దేశ పూర్వకంగా మత ఘర్షణలు సృష్టించేందుకు కుట్ర చేస్తున్నారని మైనార్టీ నాయకులు లతీఫ్ ఖాన్, ఉస్మాన్, చాన్‌పాష, షేక్ ఉస్మాన్ ఆరోపించారు. అంతే కాకుండా ఏక పక్షంగా వ్యహరిస్తున్న సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారు గురువారం మాట్లాడుతూ.. బక్రీద్ సందర్భంగా కొందరు ముస్లింలు వ్యవసాయ పొలం వద్ద ఎద్దును కోశారని తెలిపారు. దీనిని వక్రీకరిస్తూ.. ఆవు(గోమాత)ను కోశారని బీజేపీ నాయకులు మాజీ ఎంపీటీసీ వెంకటేశ్, కుమార్, ఘనపురం మహేందర్ ముదిరాజ్‌లు తప్పుడు వీడియోలతో సామాజిక మాధ్యమం వేదికగా.. విష ప్రచారం చేశారని విమర్శించారు. యువతను రెచ్చగొట్టి, ముస్లింల ఇళ్లపై దాడికి ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు ఏకపక్షంగా వ్యవహరించి, ముస్లిం మైనార్టీ యువకులపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో వీడియోలను పెట్టారని ఫిర్యాదు చేస్తే.. తమనే దూషిస్తున్నారని వాపోయారు. మతాల మధ్య చిచ్చుపెట్టే వారి మాటలు నమ్మవద్దని సూచించారు. ఇదే విషయమై.. త్వరలో రాచకొండ కమిషనర్, డీసీపీ, ఏసీపీలకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు జహంగీర్, మైమూద్‌ఖాన్, కమాల్‌ఖాన్, నయూమ్ ఖాన్, ఇబ్రహీం, ఫెరోజ్‌ఖాన్, షేక్ హైమద్, మహ్మద్ నజీర్, ఇమ్రాన్‌ఖాన్, మహమూద్‌ఖాన్, అన్వర్‌ఖాన్, షేక్ అమీరుద్దీన్, షేక్ మహమూద్, ఫైజల్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేత



కొత్తపేటలోని ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్, కార్పొరేటర్ పవన్‌కుమార్

నూతన విద్యాసంవత్సరం సందర్భంగా పాఠశాలలు తెరుచుకోవడంతో గురువారం ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో సందడి కనిపించింది. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి సాహెబ్‌నగర్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. ఆయా డివిజన్లలో కార్పొరేటర్లు అధికారులు పాఠశాలలకు వెళ్లి పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు.

– ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం



మన్సూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేసిన సరూర్‌నగర్ మండల ఎంఈఓ వాసునాయక్



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ మినాజుద్దీన్



సాహెబ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి